క్లుప్తంగా

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ జాతర



నూలివీడులో ఎల్లమ్మతల్లి ఊరేగింపు

గాలివీడు : మండల పరిధిలోని నూలివీడు పంచాయతీ నాగురువాండ్ల పల్లెకు సమీపంలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర నేటి నుంచి జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్య రోజు నుంచి తిరునాల ప్రారంభమవుతుందన్నారు. అందులో భాగంగా మంగళ, బుధవారాలలో అమ్మవారు నూలివీడు గ్రామంలో ఊరేగించారు. గురువారం రాత్రి అమ్మవారి నిండు తిరునాల జరుగుతుందని శుక్రవారం ఉదయం గ్రామ ప్రజలు బోనాలను పట్టి అమ్మవారికి మొక్కులను తీర్చుకోనున్నట్లు పేర్కొన్నారు.

దశదిన కర్మకాండలో పాల్గొన్న ఆకేపాటి

పుల్లంపేట : మండలంలోని ఉడుమువారిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు తురకా శ్రీనివాసులు రెడ్డి తల్లి దశదిన కర్మకాండలో బుధవారం రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తురక శ్రీనివాసులు రెడ్డి తల్లి మృతురాలు లలితమ్మ చిత్రపటానికి వారు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, టి.భరత్‌కుమార్‌రెడ్డి, అనంతయ్యగారిపల్లి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న కమిషనర్, కార్యాలయ సిబ్బంది

రాజంపేట : రాజంపేట పురపాలక సంఘం కార్యాలయంలో మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పురపాలకసంఘం వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలానే రాజంపేట బైపాస్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలలో ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు.

నివాళి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డీలర్ సుబ్బరామిరెడ్డి సతీమణి కటారు రవణమ్మ (60) మృతి చెందింది. దీంతో బుధవారం ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ ఛైర్మన్ పోలాతో కలసి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సుబ్బరామిరెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆకేపాటి వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, దండు గోపి, నాయకులు శ్రీనివాసులు యాదవ్, బొజ్జ పెంచలయ్య, మల్లికార్జునరాజు, కసిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, మందరం సుబ్బారెడ్డి ఉన్నారు. ఇదిలావుంటే రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆకేపాటి రజనీకాంత్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త ఆకేపాటి విక్రమ్‌రెడ్డి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

రాయచోటి : రాష్ట్ర ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం అని వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరూన్‌బాషా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కౌన్సిలర్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరూన్‌బాషా పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా హరూన్‌బాషాకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు పట్టణంలోని యువత బైక్ ర్యాలీ ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలు కోసం సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను తీసుకొచ్చి పేదలకు సంక్షేమం అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, అబద్ధాలు చెప్పి, బొమ్మలు చూపించి అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచను, మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ద్రోహి చంద్రబాబుదని హరూన్‌బాషా విమర్శించారు.

నిండుకుండలా చెరువు.. బీళ్లుగా చేనులు!

- కన్యకా చెరువులో పుష్కలంగా నీరు
- వ్యవసాయానికి దూరంగా పలువురు ఆయకట్టు రైతులు
- ముళ్లకంపలకు నిలయంగా భూములు



నిండుకుండలా కన్యకాచెరువు

నందలూరు : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కన్యకాచెరువు నిండుకుండలా జలకళను సంతరించుకుంది. కానీ చెరువు కింద పొలాల్లో ముళ్లకంపలు ఏపుగా పెరిగి బీళ్లుగా మారాయి. ఈ చెరువులోని నీటి ద్వారా నందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదరపల్లి, దుర్గాపురం ఎస్టీ కాలనీ, నందలూరు, నందలూరు హరిజనవాడ ప్రాంతాల్లోని పొలాల్లో వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. దుర్గాపురం ఎస్టీ కాలనీ, ఈదరపల్లి, నందలూరు హరిజనవాడ, నందలూరు ప్రాంతాల్లోని బోరు ఉన్న రైతులు మాత్రమే వ్యవసాయం వైపు మక్కువ చూపిస్తున్నారు. చెరువు కింద భూములు ఉన్న రైతులు వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయని పలువురు రైతులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. పలు సంవత్సరాలుగా ఇక్కడి భూముల్లోని రైతులు ఎందుకనో వ్యవసాయం చేయడానికి ముందుకు రావడం లేదు. గత కొన్ని నెలల ముందు కురిసిన వర్షాల ద్వారా చెయ్యేరులో నీరు ప్రవహించడంతో దాదాపు 30 రోజులకు పైగా ఆ నీటిని కాలువకు మళ్లించి చెరువును నింపారు. ఆ నీటిని వాడుకోకపోతే ఆ నీరు వేసవికాలంలో ఇంకిపోయి వృథాగా మారే అవకాశం ఉంది. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనేక సంక్షేమ పథకాలను వినియోగించుకుని రైతులు వ్యవసాయంపై మక్కువ చూపించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలోని రైతులు ఎక్కువ శాతం వరి, రాగులు, సజ్జలు, నువ్వులు పండించేందుకు ఆసక్తి చూపుతారు. ఇవి కాకుండా మరెన్నో రకాల పంటలు ఉన్నాయి. రైతులు పొలాలను బీడుగా వదిలివేయకుండా పంటల సాగు చేయాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా కన్యకా చెరువు కిద భూములున్న రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని పలువురు కోరుకుంటున్నారు.



ముళ్ల పొదలతో దర్శనమిస్తున్న చెరువు కింద భూములు

రైతులకు నచ్చచెబుతున్నాం



కన్యకా చెరువు కింద రైతులతో మాట్లాడుతున్నాం. అందులో కొంతమంది రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాం. వారు వేసే పంటలకు మండల వ్యవసాయ శాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని తెలియజేయడం జరిగింది.

– మల్లికార్జున, వ్యవసాయాధికారి, నందలూరు

రైతులు సాగుకు ముందుకు రావాలి



కన్యకా చెరువు కింద భూములు ఉన్న రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని కోరడం జరిగింది. చెరువు నింపేందుకు కాలువలకు మరమ్మతులు జరిపి నెల రోజులు పాటు కష్టపడి నీటిని నింపాం. ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం రైతులకు ఉంది. భూములున్న రైతులకు సాగు చేసేకునేలా అవగాహన కల్పిస్తాం.

– భూశెట్టి వెంకటసుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షులు, నందలూరు

మొక్కుబడిగా మండల సమావేశం

18 పంచాయతీలకు గాను హాజరైన ఒకేఒక సర్పంచ్



నిధుల కేటాయింపులపై సభలో ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. మండలంలో 18 పంచాయతీలు ఉండగా కేవలం ఒక సర్పంచ్ మాత్రమే హాజరుకాగా ఎంపీటీసీల కోరం ఉండటంతో సమావేశాన్ని ఎంపీడీఓ మొక్కుబడిగా జరిపించారు. ఈ సందర్భంగా పి.ఆర్. ఏఈ నాగరాజు రూ. 18 లక్షల నిధులతో పి.కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలల్లో సీసీ రోడ్లు వేశామని చెప్పడంతో ఎంపీటీసీ సభ్యులు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్‌లు నిధులన్ని ఒక పంచాయతీకేనా ఇక మండలంలో గ్రామ పంచాయతీలు లేవా అని సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మీరు పనులు వద్దన్నారంటూ ఎంపీపీ కొడుకు చంద్ర తెలిపాడని, దీంతో పనులు చేపట్టలేదని చెప్పడంతో ఎంపీటీసీ భగ్గుమన్నారు. అతనెవరు పనులు వద్దనడానికి అని ఎంపీడీఓ వద్ద వాపోయారు. మాధవరం–1 పంచాయతీలో డ్వాక్రా మహిళల వద్ద రూ. 500లు వసూలు చేస్తున్నారని, లోన్‌లు మంజూరు చేస్తే రూ. వెయ్యి ఇవ్వాలని అడుగుతున్నారని ఎంపీటీసీ శివయ్య సభ దృష్టికి తీసుకురాగా వెలుగు ఏపీఎం సుజాత స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. హౌసింగ్ ఏఈ చెన్నయ్య మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి జూన్ 15వ తేదీ లోపు నిర్మాణాలు పూర్తిచేయించేలా సహకరించాలని కోరారు. కాగా సమావేశానికి రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు గైర్హుహాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్, మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య, పి.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, పశువైద్యాధికారి శివశంకర్, ఉపాధి ఏపీఓ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్, ఎంఈఓ–2 అరుణ, ఈఓపీఆర్‌డీ మెహతాబ్ యాస్మిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న గ్రామీణ బ్యాంక్ అధికారులు

రాయచోటి టౌన్ : నాలుగు బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా మారినా సేవలు మాత్రం యథాతథంగా అందిస్తామని రాయచోటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సదాశివరెడ్డి అన్నారు. విలీన ప్రక్రియ పూర్తన తరువాత గ్రామీణ ప్రాంతాలలో ఖాతాదారులకు అవగాహన కల్పించేందుకు ఆయా ప్రాంతాలలోనే సేవా కేంద్రాల నిర్వహణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాల నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో బుధవారం ఓడీవీడు గ్రామంలోని ఖాతాదారులకు బ్యాంక్ సేవలను వివరించారు. విలీన ప్రక్రియ అనంతరం బ్యాంకులలో డిజిటలైజేషన్‌ను తీసుకొచ్చామన్నారు. బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలానే ఫిక్స్‌డ్ డిపాజిట్‌తోపాటు బంగారు రుణాలను తక్కువ వడ్డీ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ లేదా రుణాలను పూర్తిగా చెల్లించాలని కోరారు. బ్యాంకు సిబ్బంది అంటూ ఫోన్ చేసే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సమీర, ఫీల్డ్ ఆఫీసర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

మసిపూసి మారేడు కాయలా మహానాడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపి

రాజంపేట టౌన్ : కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం మసిపూసి మారేడుకాయలా ఉందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గోపి మాట్లాడారు. మహానాడు కార్యక్రమం కడపలో నిర్వహిస్తున్నందున సీఎం చంద్రబాబునాయుడు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు అలాగే రాయలసీమకు మేలు జరిగే హామీలు ఇస్తారని ప్రజలంతా ఎదురు చూశారని అయితే తొలి రెండు రోజులు సెల్ఫ్ డబ్బా కొట్టి ఊసూరుమనించారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు కడపలో మహానాడు కార్యక్రమాన్ని పెట్టారన్నారు. అయితే తొలి రెండు రోజులు మహానాడు కార్యక్రమంలో జనం లేక వెలవెలబోయి అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాకముందే చంద్రబాబు మోసాలను టీడీపీకి చెందిన నాయకులు గ్రహించి మహానాడుకు చాలా మంది ముఖం చాటేశారన్నారు. బాబు పాలన ఫెయిల్ కావడంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు పెట్టిన మహానాడు కూడా చంద్రబాబునాయుడుకు మైలేజీ తీసుకురాలేక పోయిందని ఎద్దేవా చేశారు.

ఒంటరిగా పోటీ చేసిన గెలిచిన చరిత్రలేదు

ఎన్‌టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి తొలుత సీఎం అయిన చంద్రబాబునాయుడు 1999వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకొని అమలు కాని హామీలు ఇచ్చారని అలాగే వాజ్‌పేయి హవాలో చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా స్వల్ప మెజార్టీతో అధికారాన్ని చేజిక్కించుకున్నారన్నారు. అయితే 2004వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చరిష్మా ముందు చంద్రబాబునాయుడు జిమ్మిక్కులు పనిచేయక తెలుగుదేశం పార్టీ చిత్తుచిత్తుగా ఓటమి పాలైందన్నారు. ఆ తరువాత 2009వ సంవత్సరంలో చంద్రబాబునాయుడు కమ్యూనిస్టులు, టీఆర్ఎస్ పార్టీలతో పొత్తుపెట్టుకున్నా రాజశేఖర్‌రెడ్డి తన ప్రజారంజక పాలనతో కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో గెలిపించి ఇటు రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడమే కాక అత్యధిక ఎంపీ సీట్లను కూడా గెలిపించడంతో అప్పట్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగలిగిందని ఆయన గుర్తు చేశారు. ఆ తరువాత 2014వ సంవత్సరంలో చంద్రబాబునాయుడు మరోమారు విలువలకు తిలోధకాలు ఇచ్చి బీజేపీతో పొత్తుతోపాటు జనసేన మద్దతుతో స్వల్ప సీట్ల ఆధిక్యంతో అధికారంలోకి వచ్చారన్నారు. 2019వ సంవత్సరంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగుదేశం పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. జగన్ సీఎం అయ్యాక అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ప్రజలకు మేలు చేయడంతో ఒంటరిగా పోటీచేస్తే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాదని చంద్రబాబు గ్రహించి బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకోవడంతో పాటు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించారన్నారు. 2019వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు ప్రధాని మోడీని, బీజేపీని అత్యంత దారుణంగా విమర్శించారన్నారు. అయినా ఊసరవెల్లి సిగ్గుపడేలా నిసిగ్గుగా ప్రధాని మోడీతో 2024లో మరోసారి చేతులు కలపడం ఆయనకే సాధ్యమైందని తెలియజేశారు. పొత్తుపెట్టుకోకుండా ఒంటరిగా తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సత్తా, శక్తి చంద్రబాబునాయుడుకు లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రఘురామిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఓబయ్య, గొంటు మణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న మద్దిరేవుల గ్రామ పంచాయతీ



చెత్తసేకరణను పరిశీలిస్తున్న సెక్రటరీ రజనీష్ రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవుల గ్రామ పంచాయతీలో బుధవారం ప్రతి ఇంటి నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరణ జరిగినట్లు పంచాయతీ కార్యదర్శి రెడ్డి రజనీస్ రెడ్డి తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా కేంద్రానికి తరలిస్తున్నామని వారు తెలిపారు. సేకరించిన చెత్త నుంచి తడి చెత్తను నాడెప్ తొట్లకు తరలించి దానిపై పేడతో అలుకుతున్నారు. దీని వలన దుర్గంధం రావడం లేదన్నారు. 45 రోజులు తరువాత కుళ్లిన తడి చెత్తను షెడ్డు కింద ఉన్న తొట్లలోకి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్‌తో వివిధ ఘన వ్యర్థాలను రిసైకిలింగ్ కోసం అమ్మకం చేస్తున్నామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మండలంలో డంపింగ్ యార్డుల పనితీరుపై ఆరాతీయడంతో అన్ని పంచాయతీలలో మార్పు మొదలైనట్లు తెలుస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి రజనీస్ రెడ్డి స్వయంగా గ్రీన్ అంబాసిడర్‌లతో పాటు గ్రామంలోని ప్రతి గుమ్మం నుంచి ఉదయం ఆరు గంటల నుంచే చెత్త సేకరణ చేయడం జరిగింది. గ్రామ పంచాయతీలో మైకు ద్వారా తడిచెత్త పొడి చెత్తను బండికి ఇవ్వండని గ్రామ పంచాయతీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ సహకారం అందించారు. పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది పనితీరు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మరణించిన వారి జ్ఞాపకార్థంగా మొక్కను నాటుదాం



మొక్కను అందజేస్తున్న మడగలం ప్రసాద్

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరు వారి కుటుంబాలలో మరణించిన వారి జ్ఞాపకార్థంగా ఒక మొక్కను నాటాలని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ కోరారు. మండలంలోని చెర్లోపల్లిలో మడగలం పుష్పమ్మ సంస్మరణ దినోత్సవానికి బుధవారం ప్రసాద్ విచ్చేసి వారి కుటుంబ సభ్యులకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవించినా మరణించినా మన చుట్టూ ఉన్న వారికి మేలు జరగాలన్నారు. అందుకే మొక్కను పెంచి ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు అందించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శాంతికుమార్, బాబు, ఏసన్న, జయరాజు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కష్టపడదాం



వీరనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వీరబల్లి : వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరబల్లి మండల కేంద్రంలోని నాగిరెడ్డి స్వగృహంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు గజమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాలివీటి నాగిరెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక నాయకుడు, కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు.

నేడు కొత్తకోడూరు గంగమ్మ జాతర

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణ పరిధిలోని కొత్తకోడూరులో నేడు గంగమ్మ జాతరను నిర్వాహకులు వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ప్రత్యేక అలంకరణ, విద్యుత్ దీపాలతో గంగమ్మ మంటపాన్ని ఏర్పాటు చేశారు. నేడు గురువారం ఉదయం గంగమ్మ మండపానికి తరలివచ్చి భక్తులకు దర్శనమివ్వనుంది. అలాగే శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయి. జాతర సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది



దార సుధాకర్

నందలూరు : రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్ఆర్‌సీపీ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి దార సుధాకర్ మండిపడ్డారు. నందలూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో దళితులు, మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలపై దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. ఇందుకు తెనాలి ఘటన సాక్ష్యమని పేర్కొన్నారు. మానవ హక్కులను ఉల్లంఘిస్తూ దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు నడిరోడ్డుపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, అంతేకానీ అధికారం ఉంది కదా అని దళితులను నడిరోడ్డుపైన కొట్టడం హేయమని అభివర్ణించారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని తెలియజేశారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేతలు



మాజీ సీఎం జగన్‌తో నాయకులు

రాయచోటి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నేతలు కలిశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో సుండుపల్లి సీనియర్ నాయకులు పూతిరెడ్డి అజయ్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా రాయచోటి, రాజంపేట ప్రాంతాలలో పార్టీ అభివృద్ధి తదితర విషయాలపై వారు చర్చించారు.

యోగాతో ప్రశాంత జీవనం

యోగా సాధన చేసి రోజువారీ ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మూడు నియోజకవర్గాల పరిధిలోని పట్టణాలు, మండలాల్లో యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వివిధ శాఖల సిబ్బంది పాల్గొని, యోగాసనాలను వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా విశిష్టతను యావత్ ప్రపంచం గుర్తించిందని, రాష్ట్రంలో ప్రతి పౌరుడికి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమానికి నిర్వహిస్తోందన్నారు. సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా ప్రాముఖ్యతను తెలియజేయాలని పేర్కొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెనగలూరు: యోగాంధ్రలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది



ఓబులవారిపల్లె: జెడ్పీహెచ్ఎస్‌లో యోగాంధ్రలో ఉద్యోగులు



సుండుపల్లె: యోగా ట్రైనర్ రాధారాణిని సన్మానిస్తున్న అధికారులు



రాజంపేట: మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర



నందలూరు: యోగా శిక్షణలో పాల్గొన్న అధికారులు



లక్కిరెడ్డిపల్లె: యోగా కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు



గాలివీడు: యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది